PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 201 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 17 జులై 2026

## హెడ్ కానిస్టేబుల్ నాగేల్లి సుజాతను అభినందించిన సీపి


3లో

## క్యాన్సర్ చికిత్సలో సరికొత్త విప్లవం: హైటెక్ సిటీ యశోద


3లో

# పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

**ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా**

**త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష**


2లో

# 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**- బిజినెస్ జాబితాను విడుదల చేసిన సెక్రటరీ జనరల్**



**న్యూఢిల్లీ,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల

మిగతా2లో...



# బోనమెత్తిన గోల్కొండ

- గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
- కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ

హైదరాబాద్,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్): గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ,

మిగతా2లో...

# సీతారామను పూర్తి చేస్తాం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్టు బీఆర్ఎస్ నేతల డ్రామాలు : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**సత్తుపల్లి, జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):**గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీ-డిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనానికి నష్టం కలిగించారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో

మిగతా2లో...

# వేర్ హౌసింగ్ సామర్థ్యం పెంపు

**వచ్చే 20 ఏండ్ల గిడ్డంగుల అవసరాలపై అధ్యయనం చేయండి**

**వడ్డీ భారాలు తగ్గించుకోవాలి**

**ప్రభుత్వ కార్పొరేషన్లకు మంత్రి తుమ్మల సూచన**


2లో

# ఎడ్యుకేషన్ జిహాద్‌పై బిజెపి ఆగ్రహం

- సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్



**హైదరాబాద్,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షిక మైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు

మిగతా2లో...

# రిటైర్డ్ ఇంజనీర్లు సలహాలు ఇస్తే బెదిరింపులా..?

- కరెంట్ లేక అల్లాడుతుంటే పట్టించుకోరా..?
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి గేట్లు ఎత్తొచ్చని చెప్తే.. ఆ నీళ్లు ఎత్తొచ్చని చెప్పిన ఇంజినీర్లను జైళ్లలో పెడతమని, బెల్ట్‌తో కొడ్తమని రాజకీయాలు చేస్తున్నది మీరని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు నీరందంచండి..కరెంట్ ఇవ్వండి.. విద్యుత్ సామర్థ్యం ఉన్నది.. విద్యుత్ ప్లాంట్లు ఉన్నయి. బొగ్గు లేక విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. దృష్టి పెట్టండి అని ప్రభుత్వాన్ని ముల్లు కట్టె పెట్టి నిద్రలేపుతున్నాం. మీకు విషయాలు చెబుతున్నమన్నారు. రాజకీయాలు చేయడం మీరు మానండి.. విద్యుత్ ఉత్పత్తి పెంచండి.. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వండని ప్రభుత్వానికి హరీశ్ రావు సూచించారు.. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ చేస్తారట. కమీషన్ల కోసం గ్రీన్ ఎనర్జీ పాలసీని నిలిపేశారు. నాణ్యమైన బొగ్గును వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దేవాదులకు నీళ్లు అందడానికి కారణం

మిగతా2లో...



# యూకెతో ఆర్థిక ఒప్పందంతో అధిక ప్రయోజన్

**తెలంగాణకు అనుకూలంగా మలచకుంటాం**

**యుకెకు ఎగుమతులు పెంచుతాం: మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత్-యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమ య్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. రెండు దేశాల మధ్య రూ.32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమి కండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు.

మిగతా2లో...

# ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

**- మంత్రి సీతక్క వెల్లడి**


2లో

# 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై తుది నిర్ణయం తీసుకోనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సరికొత్త బిల్లులను ఈ సమావేశాల్లో తీసుకురానుంది. ఒూష్ట్రాలు సొంతంగా ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు నిధుల వ్యయంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనుంది. ఆగస్ట్ 13వ తేదీతో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

# పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

**హైదరాబాద్,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కల్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కల్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

# రిటైర్డ్ ఇంజనీర్లు సలహాలు ఇస్తే బెదిరింపులా..?

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోతలు-వాతలు తప్ప ఏమీ లేవన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ వేస్తారట. రైతులకు నీళ్లు ఇవ్వమంటే రక్తం పారిస్తామంటున్నారు. రెండు పంటలకు బోనస్ ఎగ్గొట్టారు. విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. విద్యుత్ సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి చేయలేకపోతున్నారు. 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటే 3100 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం 33 శాతం మాత్రమే. ఎల్‌నినో వస్తుందని తెలిసినా ముందస్తు ప్రణాళిక లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక వేత్తలు, ప్రజలపై భారం పడుతోందన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

**ములుగు,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం ఏజెన్సీ మండలాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అటవీశాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ జిహాద్‌పై బిజెపి ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.

# సీతారామను పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రూపొందించారని, వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామనీ, అవసరమైన బిల్లులను సిద్ధం చేసి వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు.

**లక్షలాది ఎకరాలకు సాగునీరందించినట్టు ప్రచారం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించినట్టు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాల అనుమతులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్ట్‌లు నిర్వహిం చకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ సమస్యలు తలెత్తాయన్నారు. మిగిలిన బ్యారేజీల భద్రతపై కూడా నిపుణుల సూచనలు ఉన్నాయనీ, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబం ధించిన భూసేకరణలో ప్రభుత్వం నిర్ణయించిన విధానం ప్రకారం వేగంగా పరిహారం చెల్లింపులు చేస్తామని, అధికారులు ఈ అంశాన్ని ప్రాధాన్యం గా తీసుకోవాలని సూచించారు.

**కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి పొంగులేటి**

కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రారంభించిన అన్ని నీటిపారుదల పనులను నిజాయితీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్, వైరా--లంకసాగర్ ప్రాజెక్టులు, ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా సాధ్యమైనంత మేరకు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్ బాబు, బాగం నీరజదేవి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సీఈలు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బీఎస్ఈ యుగంధర్ రావు పాల్గొన్నారు.

# బోనమెత్తిన గోల్కొండ

(మొదటి పేజీ తరువాయి)

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరఫున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# వేర్ హౌసింగ్ సామర్థ్యం పెంపు

**హైదరాబాద్,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో రైతులకు గోదాముల సౌకర్యాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రెండేండ్లలో ప్రస్తుతమున్న సామర్థ్యానికి అదనంగా మరో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్లు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే వడ్డీ భారాన్ని తగ్గించుకుంటూ ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్ల మేనేజింగ్ డైరెక్టర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 సొంత గోదాములుండగా వాటి నిల్వ సామర్థ్యం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నులని తెలిపారు. ప్రస్తుతం ఈ గోదాముల్లో 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదై 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఈజీ, ఇన్వెస్టర్ గోదాములు, అద్దె గోదాములతో కలిపి మొత్తం 524 గోదాములను ప్రస్తుతం వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 48 కొత్త గోదాముల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరో 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామనీ, వీటి ద్వారా మరో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మొత్తంగా రాష్ట్రంలో సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కల్పించేలా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. ప్రతి కొత్త గోదాంపైనా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని సంస్థల పరిధిలోని గోదాములన్నింటినీ ఒకే సమన్వయ వ్యవస్థ కింద నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

## యూకెతో ఆర్థిక ఒప్పందంతో

# అధిక ప్రయోజన్

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, డసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 350 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చెప్పారు. యుకెకు ఎగుమతి చేయగలిగే వస్తువుల తయారీపై స్థానిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి సిఇటిఏ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఇండస్ట్రీస్ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆధిత్యకు శ్రీధర్ బాబు సూచించారు. యుకె నుంచి భారత్ పర్యటించే మేయర్ల బృందాన్ని హైదరాబాద్ ను కూడా సందర్శించేలా చూడాలని చంద్రు కె అయర్ ను మంత్రి కోరారు. అధికారులతో కలిసి యుకెను సందర్శించి అక్కడ పారిశ్రామిక, వాణిజ్య ఎకోసిస్టంను పరిశీలించాలని చంద్రు అయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు. యుకె ప్రతినిధి బృందంలో సిద్దార్థ్ విశ్వనాథన్, నళిని రఘురామన్, ప్రవీణ్ పద్మనాభన్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

**•ప్రజలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**



**హైదరాబాద్,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక విశ్వాసానికి అద్దం పట్టే ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడిన ఆయన.. భక్తుల నమ్మకాలకు, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. త్సవాల నిర్వహణలో భాగంగా దేవాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్, వైద్య సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వేలాది ఆలయాల్లో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ బోనాల జాతరను విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధమైంది.

# మల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీలు

**విద్యార్థుల సంక్షేమమే లక్ష్యమని సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు స్పష్టం...**

**భోజన నాణ్యత, పరిశుభ్రత, వసతి గృహాలు, మౌలిక వసతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జాతీయ రహదారి-163పై ఎస్సారెస్పీ కాలువ బ్రిడ్జి ప్రతిపాదనపై వివరాల సేకరణ**







**మల్లంపల్లి మండల ప్రతినిధి జులై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కాలేజ్ (బాయ్స్)ను మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు గురువారం ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా, వసతి, ఆహార, పారిశుద్ధ్య సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి విభాగాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హాస్టల్‌లో నిర్వహణ, ఆహార నాణ్యత, విద్యార్థుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా సమావేశమైన సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యంగా, పోషకాహారంతో ఉండాలని సూచించారు. హాస్టల్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఆదర్శవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు తమకు అవసరమైన సౌకర్యాలపై పలు అంశాలను సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనిఖీల అనంతరం జాతీయ రహదారి-163పై ఎస్సారెస్పీ కాలువ వద్ద ప్రతిపాదిత బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలను స్థానిక నాయకులు, ప్రజలతో చర్చించి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో పెరుగుతున్న రాకపోకలు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, హెల్త్ & మెడికల్ సెల్ వింగ్ చైర్మన్ డాక్టర్ రవి బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టి రెడ్డి రామిరెడ్డి, వనమ వేణు, కక్కర్ల సాంబయ్య, వార్డు సభ్యులు జింక వేణు, కొంగరి నరేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మల్లంపల్లి మండలంలోని విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులుగా ఎల్లప్పుడూ సహకరిస్తామని సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు పేర్కొన్నారు.

# సీతారామ ప్రాజెక్ట్ రూపకర్త కెసిఆర్

**• మన నీళ్లతో ఆంధ్ర పంట పొలాలు సస్యశ్యామలం........ • మన రాష్ట్రంలో పంట పొలాలు బీడు భూములు..... • రైతుల కోసం ఏ త్యాగానికైనా సిద్ధమే.... • సీతారామ ప్రాజెక్ట్ నీళ్లు కల్లూరు పాత ఆయకట్టుకు అందించాలి...... • సర్ నియోజకవర్గ వ్యాప్తంగా 70 శాతం పూర్తి.....**

**• మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**





**కల్లూరు, జులై 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సీతారామ ప్రాజెక్టు తొంభై శాతం పూర్తి చేసింది కేసీఆర్ ఏ 10% పూర్తి చేయడానికి ఇబ్బందులు పడుతున్న ఇప్పుడు ప్రభుత్వ నాయకులు గొప్పలు చెబుతున్నారని ఎవరు ఏమి చేశారు అనేది రైతులకు పూర్తిగా తెలుసని రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. గురువారం కల్లూరు ఫంక్షన్ హాల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయి దిగజారి అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని ఉన్న వనరులను వినియోగించుకోవడం చేతకాక టిఆర్ఎస్ పార్టీపై ఆక్రోసం వెలగకుతున్నారని అన్నారు. మన రాష్ట్రం నీళ్లతో ఆంధ్రాలో పంటలు సస్యశ్యామలంగా పండించుకుంటున్నారని కానీ మన రాష్ట్రంలో పంట పొలాలు బీడు భూములుగా మారాయి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంకా ఇతర ప్రాజెక్టు కూడా కేసీఆర్ రాష్ట్ర రైతాంగం కోసం కోట్లు వెచ్చించి సకాలంలో పూర్తిచేసి రైతంగానికి నీళ్ళు అందించారు. చిన్న చిన్న ఇబ్బందులు భూతద్దంలో చూపించి బిఆర్ఎస్ పార్టీపై ఆరోపణ చేయటం సిగ్గుచేటు అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ 90% పూర్తి చేసింది కేసీఆర్ అని 10 శాతం కే నాయకులు ఏవేవో గొప్పలు చెబుతున్నారని కల్లూరు ఆయకట్టుకు సీతారామ నీళ్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియలు భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా 70 శాతం ఆన్లైన్ ప్రక్రియ పూర్తయిందని పెంచిన గడువు నీ పూర్తిస్థాయి సద్వినియోగం చేసుకొని వంద శాతం ఆన్లైన్ అయ్యేలా నాయకులు బిఎల్ఎ లు చొరవ చూపాలి అన్నారు. **రైతుల కోసం ఏ త్యాగానికైనా సిద్ధమే....సండ్ర** దేశానికి అన్నం పెట్టే రైతన్న పంటలు పండించేందుకు నీళ్లు కావాలని అడిగితే రక్తం చెల్లితే పంటలు పండుతాయి అనటం సీఎం మూర్ఖత్వం అని అన్నారు. రక్తం చల్లితే పంటలు పండుతాయి అంటే రైతుల కోసం రక్తం ఇవ్వటానికైనా ఏ త్యాగానికైనా బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. **సీతారామ ప్రాజెక్టు నీళ్లు కల్లూరు ఆయకట్టుకు అందించాలి...సండ్ర** సీతారామ ప్రాజెక్టు నీళ్ళు ఆంధ్రకు వెళుతున్నప్పటికీ కల్లూరు కి అందడం లేదని వెంటనే నీళ్లు అందించాలని సండ్ర డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్ఎస్పి కార్యాలయం ఎదుట రైతులు అందరు కలిసి ధర్నా చేపట్టడం జరుగుతుందని రైతులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాలేపు రామారావు. మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ బాబు, సొసైటీ చైర్మన్ నర్వనేని పెద్ద అంజయ్య ,మండల యూత్ అధ్యక్షులు ప్రతాప్ ల్యాబ్ అధినేత కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ, ఇస్మాయిల్, సర్పంచులు వేము కృష్ణ, పోట్రూ శ్రీనివాసరావు, జినుగు శ్రీనివాసరావు, నాయకులు కాటంనేని వెంకటేశ్వరరావు, కొరకుప్ప ప్రసాద్, మేకల కృష్ణ, దేవరపల్లి నాగప్రసాద్, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ ఉప్పు సుబ్బారావు, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, సిహెచ్ కిరణ్, రావుఫ్, సయ్యద్ ఇంతియాజ్, కమ్లి, రాచమల్ల నాగేశ్వరరావు, కట్ట ఆర్ల ప్ప, చారుగుండ్ల సందీప్ కుమార్, దార్ల నరసింహారావు, పెద్దబో యిన నారాయణరావు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# అక్రమంగా పట్టా చేయించుకొన్న భూమిని రద్దు చేయాలి

**కొడుకు, మనవడి నుండి ప్రాణ హాని ఉంది....**

**- రక్షణ కల్పించి న్యాయం చేయండి...**

**విలేఖరుల సమావేశంలో బాధితులు శివలా,తులసి బాయ్**




**ఖమ్మం, ప్రతినిధి జూలై 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** అక్రమంగా తన పొలం పట్టా చేయించుకున్నారని, దాన్ని రద్దు చేయాలని, కొడుకు, మనవడి నుండి ప్రాణ హానీ ఉందని, రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితులు శివ లా వేడుకున్నాడు. కూసుమంచి మండలం రావిచేట్టు తండా కు చెందిన శివలా తన కోడలు తేజావత్ తులసి బాయి తో కలిసి ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూసుమంచి రెవెన్యూ పరిధిలోని తమ వ్యవసాయ పొలంలో సాగు చేస్తుండగా తన కుమారులు కోడళ్ళు కలిసి నాపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని శివలా ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రాణ హానీ ఉందని రక్షణ కల్పించాలని వేడుకున్నాడు. తులసి బాయి మాట్లాడుతూ...గత నెల జూన్ 5న ఆదివారం సాయంత్రం 4:15 నిముషాలకు నా పొలంలో వరి నారుకు నీళ్లు పెట్టేందుకు వెళ్ళానని , అదే సమయంలో మా మామ చేనును ట్రాక్టర్ తో దున్నెందుకు మా బావ, ఆయన కుమారుడు వచ్చారని తెలిపారు. ఆ పొలాన్ని మా మామను భయపెట్టి బలవంతంగా లాక్కున్నారని తెలిపా రు. ఇది గ్రహించిన మా మామ ఆ పొలాన్ని నాకు కౌలుకు ఇచ్చారని, అతని బాగోగులు కూడా నేను ,నా కుమార్తెలు చూసు కుంటు న్నామని తెలిపారు. రెండేళ్ల క్రితం నా భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయారని, నాకు అండదండలు ఎవరూ లేరని గ్రహించి, నాపై , ఆడపిల్లలపై దాడికి పాల్పడు తున్నారని పేర్కొ న్నారు. అసభ్యకరమైన పదజాలం తో బూతులు తిడు తూ రాళ్లతో కట్టెలతో గాయపరు స్తున్నారన్నారని, మీ అంతు చూస్తాం. నిన్ను చంపి అయినా సరే ఈ పొలాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

# తాజుద్దీన్ బాబా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న నగర ఎంఐఎం పార్టీ యూత్ ఐకాన్ లీడర్ మజర్ బాబా



**కరీంనగర్ టౌన్, 16(పీసీడబ్ల్యూ న్యూస్):** మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగపూర్ జిల్లాలో ఉన్న హజ్రత్ తాజుద్దీన్ బాబా రహ్మతుల్లా అలైహి వారి 104వ ఉర్సు మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం షాహి సందల్, చాదర్ సమర్పణ కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం వేలాది మంది భక్తులు దర్గాకు చేరుకుని సందల్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం విద్యుత్ దీపాలంకరణ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ ఖవ్వాలి గాయకులు ఆధ్యాత్మిక గీతాలతో భక్తులను అలరించారు. ఉర్సు ఉత్సవాలకు లక్ష మందికి పైగా భక్తులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా దర్గా పరిసరాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు దర్గాను ప్రత్యేక విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రథమ చికిత్స కేంద్రం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన నగర నగర ఎంఐఎం పార్టీ యూత్ ఐకాన్ లీడర్ మజర్ బాబా ఉర్సు ఉత్సవాలకు హాజరై హజ్రత్ తాజుద్దీన్ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్ సమర్పించి తన మొక్కును తీర్చుకున్నారు.



# రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనకు కృషి చేయాలి: జూపాక శ్రీనివాస్




**గోదావరిఖని, జూలై 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, కేంద్ర కమిటీ నాయకుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతి సందర్భంగా గురువారం గోదావరిఖనిలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో స్మారక సభ నిర్వహించారు. పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ తన జీవితాన్ని ప్రజల కోసం, విప్లవ ఉద్యమం కోసం అంకితం చేశారని అన్నారు. ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాత జీవితం గడుపుతూ ఉద్యమాన్ని కొనసాగించారని, అనంతరం ఇల్లందు, మహబూబాబాద్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పార్టీ, రైతు సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అతివాద, మితవాద ధోరణులకు వ్యతిరేకంగా సిద్ధాంతపరమైన పోరాటం చేసి, ప్రజాపంథానే సరైన మార్గంగా భావించి చివరి వరకు అదే సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని చెప్పారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, రైతు ఉద్యమాలకు ఆయన విశేష సేవలందించారని, ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమంలో కూడా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయాలను, లక్ష్యాలను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు తోకల రమేష్, ఈసంపల్లి రాజేందర్, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, బుషిపాక దేవయ్య, కోడిపుంజుల లక్ష్మి, మార్త రాధ, ఇనుగాల రాజేశ్వర్, కలువల రాయమల్లు, క్రాంతి, రాజయ్య, దీవెనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ కోసం కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలో ఉద్యోగ నియామక కార్యక్రమం

**హనుమకొండ జూలై 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండ లోని తెలంగాణ నైపుణ్య మరియు విజ్ఞాన కేంద్రం (టీఎస్‌కేసీ) & ప్లేస్‌మెంట్ సెల్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ సంస్థ కోసం కళాశాల సెమినార్ హాల్‌లో ఉద్యోగ నియామక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ నియామక ప్రక్రియలో 2023, 2024, 2025 మరియు 2026 సంవత్సరాలలో బి.ఎస్సి., బి.కాం., బి.ఏ. మరియు ఎం.ఎస్సి. (ఆర్గానిక్ కెమిస్ట్రీ) పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. తన అధ్యక్షోపన్యాసంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి ఉద్యోగ నియామక కార్యక్రమాలు విద్యార్థులు తమ వృత్తి జీవితాన్ని ప్రారంభించేందుకు చక్కటి అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలు, సంభాషణా నైపుణ్యాలు మరియు వృత్తిపరమైన దృక్పథాన్ని నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో కృషి చేసిన తెలంగాణ నైపుణ్య మరియు విజ్ఞాన కేంద్రం (టీఎస్‌కేసీ) &



ప్లేస్‌మెంట్ సెల్ మరియు నిర్మాణ్ ఆర్గనైజేషన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా డా. ఎ. అనిల్ కుమార్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ సంస్థలోని నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి మరియు గిడ్డంగుల నిర్వహణ విభాగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలో పాల్గొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే ఈ అవకాశాన్ని కల్పించిన నిర్మాణ్ ఆర్గనైజేషన్



మరియు హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ మానవ వనరుల ప్రతినిధి శ్రీ వేణు మాధవ్ సంస్థలోని ఉద్యోగ అవకాశాలు, నియామక విధానం, ఉద్యోగ పురోగతి అవకాశాలు మరియు ఎంపిక విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఇంటర్వ్యూలో ఆత్మవిశ్వాసంతో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ తరఫున సెంటర్ మేనేజర్ శ్రీ బి. రాఘవ కుమార్, శ్రీ శ్రీకాంత్ మరియు శ్రీ నరేష్ పాల్గొని భవిష్యత్తులో కూడా విద్యార్థులకు మరిన్ని ఉపాధి



అవకాశాలు కల్పించేందుకు తమ సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ ఉద్యోగ నియామక కార్యక్రమంలో మొత్తం 75 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 15 మంది విద్యార్థులు తదుపరి ఎంపిక ప్రక్రియకు ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనాథ్, డా. ఎన్.ఆర్.సి.హెచ్. శ్రీకాంత్, జేకేసీ మెంటర్ శ్రీ పి. సాగర్, డా. జి. కె. కుమార్, ఇతర అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థు లు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ మానవ వనరుల బృందం ఉద్యోగ నియామక ప్రక్రియను నిర్వహించింది.

# ఎల్లలు దాటిన సేవకు అత్యున్నత గౌరవం



### కరోనా సంక్షోభంలో మానవత్వానికి అండగా నిలిచిన డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు 'ఎక్సెలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు'

### సేవే శ్వాస... మానవత్వమే చిరునామా


### ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అరుదైన సత్కారం సమాజం కోసం చేసిన త్యాగానికి లభించిన గౌరవం

**ఖమ్మం ప్రతినిధి, జూలై 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో ఉన్న మనిషికి అండగా నిలవడం ఒక బాధ్యత అయితే... ప్రాణాలకు తెగించి వేలాది మందికి ఆశాకిరణంగా నిలవడం మహోన్నత సేవ. అలాంటి నిస్వార్థ సేవా తపనకు ప్రతీకగా నిలిచిన ఖమ్మంలోని పులిపాటి విద్యాసంస్థల అధినేత, ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవకుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మక "ఎక్సెలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు" వరించింది. ఈ అవార్డును గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం (ఉండవల్లి)లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా అందజేయడం విశేషం.కరోనా మహమ్మారి ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేసిన రోజుల్లో ఎంతోమంది ప్రాణభయంతో ఇళ్లకే పరిమితమైన వేళ... డాక్టర్ పులిపాటి మాత్రం మానవత్వాన్ని తన కర్తవ్యంగా భావించి సేవా యజ్ఞం కొనసాగించారు. బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, మందులు, ఆహారాన్ని స్వయంగా అందిస్తూ లక్షలాది రూపాయలు వెచ్చించారు. ఆ కష్టకాలంలో నిరాశలో ఉన్న అనేక కుటుంబాలకు ఆయన అందించిన చేయూత కొత్త ఆశలను నింపింది.అంతటితో ఆగకుండా, వైద్యరంగంలో చదువుతున్న సుమారు మూడు వేల మంది మెడికల్, పారా మెడికల్ విద్యార్థులను "కరోనా వారియర్స్"గా తీర్చిదిద్దుతూ, కరోనా బాధితులకు సేవలు అందించేలా ప్రోత్సహించారు. ప్రాణాలకు ముప్పు ఉన్న పరిస్థితుల్లోనూ మానవ సేవే పరమోన్నత ధర్మమని చాటిచెప్పిన ఆయన సేవలకు గుర్తింపుగానే శిల్ప కళా ఆర్ట్స్ ఇంటర్నేషనల్ అకాడమీ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపికైన తొమ్మిది మంది ప్రముఖుల్లో డాక్టర్ పులిపాటి ఒకరు కావడం ఆయన సేవా విశిష్టతకు నిదర్శనం. **సేవా బాటలో మూడు దశాబ్దాల అనుబంధం...**డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మూడు దశాబ్దాలకుపైగా సాన్నిహిత్యం ఉంది. విద్యార్థి దశలోనే దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుతో అనుబంధం ఏర్పరుచుకుని, తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆ అనుబంధమే నేడు సేవా గౌరవానికి సాక్ష్యంగా నిలిచింది. అవార్డు అందజేసిన అనంతరం విద్యా, సేవా, రాజకీయ రంగాల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని సీఎం చంద్రబాబు ఆశీర్వదించడం విశేషం.ఈ సందర్భంగా డాక్టర్ పులిపాటి మాట్లాడుతూ, "దేశ రాజకీయాల్లో విశిష్ట నాయకుడైన చంద్రబాబు నాయుడు చేతుల



మీదుగా ఈ అవార్డు అందుకోవడం నా పూర్వజన్మ సుకృతం. ఈ గౌరవం నాలో సేవాభావాన్ని మరింత పెంచుతుంది" అని భావోద్వేగంగా అన్నారు.**పురస్కారాల వెనుక సేవా గాథ...**డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు పురస్కారాలు కొత్తవి కావు. అయితే ప్రతి అవార్డు వెనుక ఒక మానవీయ కథ, ఒక సామాజిక బాధ్యత, ఒక సేవా ప్రయాణం దాగి ఉంది. కరోనా సమయంలో న్యాయవాదులు, నిరుపేద కుటుంబాలకు లక్షల రూపాయల విలువైన నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడంతో పాటు, తన విద్యాసంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సుమారు రూ.13 లక్షల మేర ఫీజు రాయితీలు కల్పించి ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఐదు లక్షల మొక్కలు నాటించి, ప్రకృతి సంరక్షణకు విశేష కృషి చేసి ప్రభుత్వ గుర్తింపు పొందారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, విద్యా అభివృద్ధి, సామాజిక చైతన్యం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సేవలు... ఇలా ఏ రంగాన్ని చూసినా ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది.**అనేక గౌరవాలు... ఒకే సందేశం సేవే పరమార్థం** డాక్టర్ పులిపాటి సేవలకు గుర్తింపుగా గతంలో జీ తెలుగు అచీవర్స్ అవార్డు, ఉత్తమ ఎడ్యుకేషనలిస్ట్ అవార్డు, మహాత్మా గాంధీ నేషనల్ అవార్డు, ఉత్తమ విద్యా సంస్థల అవార్డు, వాగ్దేవి జాతీయ విద్యా పురస్కారం, పర్యావరణ పరిరక్షణ విశిష్ట సేవా అవార్డు వంటి ఎన్నో గౌరవాలు వరించాయి. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తదితరుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాలు అందుకోవడం విశేషం.సమాజం కోసం చేసే సేవకు సరిహద్దులు ఉండవని... కష్టాల్లో ఉన్న మనిషి ముఖంలో చిరునవ్వు పూయించడమే నిజమైన విజయమని తన జీవితంతో చాటిచెప్పిన డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు లభించిన "ఎక్సెలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు" వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు... మానవత్వానికి లభించిన అరుదైన గుర్తింపుగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

# కరీంనగర్‌లో వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం



**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలిసి రథయాత్రలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ టౌన్ 16(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో ఇస్కాన్ మరియు శ్రీ రాధా గోవింద మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని జగన్నాథుని రథాన్ని భక్తులతో కలిసి లాగి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రథంపై కొలువై ఉన్న శ్రీ జగన్నాథ స్వామివారిని దర్శించుకోవడం ప్రతి భక్తుడి జన్మను ధన్యం చేస్తుందని పేర్కొన్నారు. జగన్నాథుని ఆశీస్సులు కరీంనగర్ నగర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నగరంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సోదరభావం, సద్భావన, ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెంపొందుతాయని అన్నారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రీ జగన్నాథ రథయాత్ర భారతీయ



సంస్కృతి, సనాతన ధర్మ వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ మహోత్సవం నగర ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను మరింత పెంపొందిస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు ఇస్కాన్ సంస్థ, నిర్వాహకులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ మహోత్సవంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావ్, కార్పొరేటర్లు, శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ప్రతినిధులు, డాక్టర్ నరహరి దాస్, కన్న కృష్ణ , డాక్టర్ ఎన్. రాధాకృష్ణ రెడ్డి, డాక్టర్ ఇ. విజయేందర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, కెప్టెన్ వడ్ల మధుసూధన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇస్కాన్ నిర్వాహకులు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని శ్రీ జగన్నాథ స్వామివారి ఆశీస్సులు పొందారు

# సైదాబాద్ సక్సెస్ స్కూల్ ఘటనపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్, జూలై 16(పీసీడబ్ల్యూ న్యూస్):** సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెలువడిన ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ విద్యార్థులను మతపరమైన ప్రార్థనలు చేయాలని బలవంతపెట్టడం, హిందూ సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించడం అంగీకారయోగ్యం కాదని అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలను ఉపేక్షిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఇటీవల ఆటో డ్రైవర్ భరత్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, ఆయనపై చర్యలు తీసుకున్న పోలీసులు, సంబంధిత వ్యక్తుల పాత్రపైనా విచారణ జరపాలని కోరారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయం ఉండకూడదని అన్నారు.భవిష్యత్తులో విద్యాసంస్థల్లో అన్ని మతాల విద్యార్థుల హక్కులు, విశ్వాసాలు గౌరవించబడేలా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ పేర్కొన్నారు. గమనిక: పై కథనం బండి సంజయ్ చేసిన ఆరోపణలు, వ్యాఖ్యల ఆధారంగా రూపొందించబడింది. సక్సెస్ స్కూల్ యాజమాన్యం లేదా సంబంధిత అధికారుల స్పందన అందుబాటులో ఉంటే, సమతుల్య వార్త కోసం దానిని కూడా చేర్చడం మంచిది.

# కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం.. భారీ నిధులతో నగర రూపురేఖలు మారుస్తాం: కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్,జూలై16(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, కేంద్రం నుంచి భారీ నిధులు తీసుకువచ్చి నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.శుక్రవారం కరీంనగర్ నగరంలోని 36వ డివిజన్ మారుతీనగర్లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు, అలాగే 27వ డివిజన్ శివాజీనగర్లో రూ.49 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్మార్ట్ సిటీ, అమృత్-1, అమృత్-2, అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్ వంటి పథకాల ద్వారా ఇప్పటికే కరీంనగర్‌కు వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చామని తెలిపారు. ఇటీవల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అదనంగా మరిన్ని నిధులు కూడా రానున్నాయని చెప్పారు.ఈ నిధులతో నగరంలో





మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఆధునిక పట్టణ మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు శివారు ప్రాంతాల గల్లీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి కరీంనగర్ రూపురేఖలను మార్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.పార్లమెంట్ సభ్యుడిగా తన పదవీకాలంలో కరీంనగర్ అభివృద్ధి కోసం సుమారు రూ.22 వేల కోట్లకు పైగా నిధులు సమీకరించినట్లు బండి సంజయ్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి 12-బి హోదా, లా కళాశాల మంజూరు, ఎస్ఆర్ఆర్ కళాశాలకు అటానమస్ హోదా, తీగలగుట్టపల్లి ఆర్ఓబీ నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రులకు ఆధునిక పరికరాల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ వంటి అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు.భవిష్యత్తులో కూడా కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# కరీంనగర్‌లో ఘనంగా పూరి జగన్నాథ్ రథయాత్ర



**కరీంనగర్,జూలై16(పీసీడబ్ల్యూన్యూస్):** కరీంనగర్ నగరంలో నిర్వహించిన శ్రీ పూరి జగన్నాథ్ రథయాత్ర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. టవర్ సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మాజీ మేయర్ వై. సునీల్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగన్నాథ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథయాత్రలో పాల్గొని భక్తులకు అభివాదం చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ యాత్రలో పాల్గొన్న భక్తులతో కలిసి ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ జగన్నాథ స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుఖశాంతులు, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని నాయకులు ఆకాంక్షించారు.

# బీఎస్పీ కార్యకర్త మృతి ఉద్యమానికి తీరని లోటు: అడ్వకేట్ నిషాని రామచంద్రం

**హుజురాబాద్, జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):**బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కార్యకర్త, సైదాపూర్ మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన కొయ్యేడ మధు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి, ఉద్యమానికి తీరని లోటని బీఎస్పీ చీఫ్ జోన్ ఇన్‌చార్జి అడ్వకేట్ నిషాని రామచంద్రం పేర్కొన్నారు.మధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజురాబాద్ సివిల్ ఆసుపత్రికి తరలించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్‌తో కలిసి నిషాని రామచంద్రం ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దహన సంస్కారాల కోసం పార్టీ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మధు మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆసుపత్రికి చేరుకుని కుటుంబానికి అండగా నిలిచారు. ప్రమాదంలో గాయపడిన మధు కుమార్తె అక్షిత (8)ను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి



తరలించారు. ఆమెకు ఉత్తమ వైద్యం అందించాలని నిషాని రామచంద్రం ఎంజీఎం వైద్యులను కోరారు.ఈ సందర్భంగా ప్రమాదానికి కారణమైన కడారి రాజశేఖర్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వాహనాల తనిఖీల సమయంలో కేవలం జరిమానాలు విధించడం కాకుండా, వాహనదారులకు బీమా (ఇన్సూరెన్స్) తప్పనిసరిగా ఉండేలా పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు.చింతలపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై నిర్మించిన గద్దెలు వంటి అక్రమ నిర్మాణాల వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్, పార్లమెంట్ ఇన్‌చార్జి దొడ్డే శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఇల్లెందు రమేష్, హుజురాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు వేల్పుల మల్లేశం, అంబాల ప్రభు, హుస్నాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు వేల్పుల రాజు, హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు గిన్నారపు మహేందర్, అసెంబ్లీ కమిటీ ఉపాధ్యక్షుడు కండె తిరుపతి, మాజీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, బోయిని బాబు, మంద సమ్మయ్య పాల్గొన్నారు.

# టి-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ




**హైదరాబాద్, జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):**

కేంద్ర ప్రభుత్వ ఆమోదిత సంస్థ టి-సేవ ఆన్ లైన్ స్కిల్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టి-సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి తెలిపారు. స్కిల్ కేంద్రాల ద్వారా వెయ్యికి పైగా స్కిల్ డెవలప్ మెంట్ కోర్సుల్లో ఆన్ లైన్ శిక్షణ, వివిధ ఆన్ లైన్ సేవలు వినియోగదారులకు అందించడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చునని ఆయన సూచించారు. బస్సు, ట్రైన్, విమాన టికెట్స్ బుకింగ్, వివిధ బ్యాంకుల ద్వారా మనీ ట్రాన్స్ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు, క్యాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్ అండ్ కార్ ఇన్స్యూరెన్స్, బిల్లుల చెల్లింపులు, కొత్త పాన్ కార్డుల ఆప్లై, కరెక్షన్స్ చేయవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు సెల్: 8179955744, వెబ్సైట్: www.tsevaonline.com ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# భూ రీ-సర్వేలో క్షేత్రస్థాయిలో సంపూర్ణ పారదర్శకత పాటించాలి

**సత్తుపల్లి మండల తహసీల్దారు కార్యాలయంలో భూ రీ-సర్వే పై సర్వేయర్లు, రెవెన్యూ అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**సత్తుపల్లి, జులై 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :**భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.బుధవారం సత్తుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి మండల సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులు, లైసెన్స్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి భూ రీ-సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించి కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, భూ రీ-సర్వే ఉద్దేశం భూమిని విభజించడం కాదని, ఆ భూమిపై ప్రస్తుతం ఎవరు సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత భూమి



నమోదై ఉంది, వారికి పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా అనే అంశాలను మాత్రమే నిర్ధారించడమే రీ-సర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు.పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం సరిపోతున్నాయా లేదా అన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, అసాధారణంగా ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణం నమోదైతే, దాని కారణాలను పూర్తిగా పరిశీలించి ధృవీకరించాలని సూచించారు.ప్రతి భూ రీ-సర్వే సమయంలో సంబంధిత రైతు వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలు వంటి అన్ని పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని అన్నారు. సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా తయారు చేయడం, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో ఇప్పటికే భూ రీ-సర్వే విజయవంతంగా నిర్వహించామని, ఆధునిక సర్వే పరికరాలతో గ్రామాల మధ్య సరిహద్దు సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. అక్కడ ప్రజలు రీ-సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారని, కుటుంబ వివాదాలు మినహా పెద్దగా అభ్యంతరాలు రాలేదని కలెక్టర్ గుర్తు చేశారు.ఈ సమావేశంలో ఏడీ సర్వేయర్ రాజేందర్, సత్తుపల్లి మండల తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్లు, గ్రామ పాలనాధికారులు, లైసెన్స్ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు పడాలని పూజలు..





**పరకాల, జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):**పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో రాజరాజేశ్వర ఆలయంలో ఆలయ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జల అభిషేకం నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు గోపినాథ్ శర్మ పూజలు చేశారు..ఈ కార్యక్రమానికి గ్రామస్థులు పాల్గొన్నారు.సకాలంలో వర్షాలు పడాలని పాడి పంటలతో అందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆలయంలో పూజలు నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు రేవూరి రాజిరెడ్డి, గంట ఆదిరెడ్డి, గంట కృష్ణరెడ్డి, రామలింగం, దేవునూరి మల్లయ్య, మహిళా భక్తులు పాల్గొన్నారు..

# బీసీ గురుకులాల్లో విద్యార్థులకు సీట్లు కల్పించిన బీసీ సేన నాయకులు

**షాద్‌నగర్, జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణన్న ఆధ్వర్యంలో గురువారం బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పలువురు విద్యార్థులకు ప్రవేశ సీట్లు కల్పించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణన్న చేతుల మీదుగా విద్యార్థులకు సీట్లకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీసీ విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించడంలో బీసీ సేన ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు సూప



ప్రకాష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జయ శ్రీకాంత్, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు పోలేపల్లి శ్రీనివాస్ గౌడ్, జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షులు లింగం యాదవ్, షాద్‌నగర్ టౌన్ అధ్యక్షురాలు కే. సరస్వతితో పాటు పలువురు బీసీ సేన నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సహకారానికి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పీఎం పసల్ బీమా రాష్ట్రంలో అమలు చెయ్యాలి: బీజేపీ అధ్యక్షులు సిరికొండ బలరాం




**ములుగు,జూలై 16(పిసిడబ్ల్యూ న్యూస్):** గురువారం రోజున ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏ ఓ రాజకుమార్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది ఈ కార్యమానికి ముఖ్య అతిధిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం పసల్ బీమా తెలంగాణ రాష్ట్రం లో అమలు చెయ్యాలని అన్నారు అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ప్రజల నమ్మించి అధికారం లోకి వచ్చిన తర్వాత ఎకరాకు 15వేలు కౌలు రైతులకి సంత్సరానికి 12000వేలు ఇవ్వని ఏడలా రైతుల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జహార్ బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్ర చారి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జీనికుల కృష్ణాకర్ రావు బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు వెంకన్న బి జె పి జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సుమలత బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు రాయంచు నాగరాజు కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జితేందర్ రావు బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు ఇర్సవడ్ల జగన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రాణహితకు మళ్లీ ప్రాణం...

**వారం రోజుల్లో మహారాష్ట్ర సీఎంతో కీలక చర్చలు**

**సీతారామ, సీతమ్మసాగర్, దేవాదుల ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి**

**ఖమ్మం ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం**

**సాగునీటి రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం**

**పర్యావరణ, న్యాయ, సాంకేతిక అడ్డంకులన్నీ తొలగించి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం**

**- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**సత్తుపల్లి, జూలై 16 (పిసిడబ్ల్యూ న్యూస్)** :తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తామని ఆయన ప్రకటించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సత్తుపల్లి టన్నెల్ వద్ద సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు.దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి వారం రోజుల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కీలక చర్చలు జరపనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ భేటీతో ప్రాణహిత ప్రాజెక్టు అమలులో కొత్త మలుపు తిరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.సీతమ్మసాగర్‌కు చట్టబద్ధ మార్గంలో గ్రీన్ సిగ్నల్సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులు సాధించి చట్టబద్ధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు.సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన 67 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్ర జల సంఘం తుది అనుమతి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తి మరింత వేగవంతం కానుందని తెలిపారు. ఖమ్మం జిల్లా పొలాలన్నింటికీ గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి సాగుభూమికి గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలన్నింటినీ వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం పునరుద్ధరణ శాస్త్రీయంగానేమేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకుండానే తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో పంట పండించారని మంత్రి తెలిపారు. యాసంగి సీజన్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు రూ.19 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు దాదాపు రూ.80 వేల కోట్లకు పైగా నేరుగా చెల్లించినట్లు వెల్లడించారు.నీటిపారుదల శాఖకు కొత్త దిశ నీటిపారుదల శాఖలో వెయ్యికి పైగా ఇంజినీర్ల నియామకం, దాదాపు 1,800 మంది ఫీల్డ్ సిబ్బంది నియామకం, పెండింగ్ పదోన్నతుల మంజూరు వంటి చర్యలతో శాఖకు కొత్త ఊపు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. రైతుల శాశ్వత ప్రయోజనాల కోసం, ప్రజల భద్రత కోసం, శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం..: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**సీతారామ, ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి**

**భూసేకరణకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తాం**

**యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు**







**సత్తుపల్లి, జూలై 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ.1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు.తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దాదాపు రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా అదనపు ఆయకట్టు తీసుకురాలేదని విమర్శించారు.సీతారామ ప్రాజెక్టులో గతంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ ప్రస్తుతం రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 100 కోట్లతో కొత్తగా రాజీవ్ లింక్ కెనాల్‌ను మంజూరు చేసి రికార్డు సమయంలో పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరుపాలేరు లింక్ కెనాల్ పనులను కూడా చేపట్టామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండేందుకే హైదరాబాద్‌లో మాత్రమే సమీక్షలు నిర్వహించకుండా నేరుగా ప్రాజెక్టుల వద్దకే వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఇక్కడే సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేలా ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు.నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు.సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వ విధానం ప్రకారం వేగంగా చెల్లింపులు చేయాలని నిర్ణయించామని, జిల్లా కలెక్టర్లు, అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు.టీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల శాఖను సర్వనాశనం చేశారని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి గత పాలకుల హయాంలో నిర్వీర్యమైన ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వడం లేదని అనవసరంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సీతమ్మ సాగర్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ నిధులను విడుదల చేయడంతో పాటు ఇప్పటికే చేసిన పనులకు 50 శాతం బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎంను కోరారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎన్‌జీటీ కేసును పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నేడు సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టీఎంసీల నీటి కేటాయింపులు, టీఏసీ క్లియరెన్స్ తమ ప్రభుత్వమే సాధించిందని తెలిపారు. చట్టపరమైన సమస్యలను పరిష్కరించి సీతమ్మసాగర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని చెప్పారు.నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2004లో ప్రారంభించిన దేవాదుల, సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. సీతారామ, సీతమ్మసాగర్‌తో పాటు గోదావరిపై పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని తెలిపారు.జూలై నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై చర్చలు జరిపి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్యారేజీలు గత ప్రభుత్వ హయాంలోనే కుంగిపోయాయని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వాటిలో నీటిని నిల్వ చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.మూడు బ్యారేజీలకు ఒకే విధమైన ఫౌండేషన్ ఉన్నందున నీటిని నిల్వ చేయకుండా పరీక్షలు నిర్వహించి, టెస్ట్ రిపేర్ ఫలితాల ఆధారంగా మరమ్మతులు చేపడుతున్నామని, భారత సైన్యానికి చెందిన అధికారి, నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాలేదని, డిండి ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచిపోయాయని, సీతారామ ప్రాజెక్టుపై రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు రాలేదన్నారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు.ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా–లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో తాత్సారం చేయకుండా వేగంగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నా ఫోటోలు తీయకండి ప్లీజ్: మౌనీరాయ్




బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.

--------------

# మహాప్రభు జగన్నాథ్ విడుదలపై స్టే

### నేడు విచారించనున్న సుప్రీం కోర్టు




ఎ లీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తక్షణమే ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ కోరారు. యానిమేషన్ ఫిల్మ్‌లో జగన్నాథుడి పాత్రను చిత్రీకరించిన విధానంపై న్యాయ సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని ఒడిశా హైకోర్టు తన తీర్పులో చెప్పింది. మహేశ్ కుమార్ సాహూ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు ఇస్తూ సినిమా రిలీజ్‌పై స్టే విధించింది. పిల్ దాఖలు చేసిన వారిలో పూరి ఆచార్య డాక్టర్ ప్రమోద్ కుమార్, ఉమాశంకర్ ఆచార్య కూడా ఉన్నారు. ఒడిశాలో చిత్ర ప్రదర్శన ఆపేయాలని, ఆ సినిమాకు సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఒడిశా కోర్టులో పిటీషన్ వేశారు. చిత్రంలో జగన్నాథుడి బాల్యం, డైలాగ్‌లు, సాహసాలు, యుద్ధ సన్నివేశాలు చూపించిన తీరును తప్పుపట్టారు. ఆ సన్నివేశాలన్నీ స్కంద పురాణం, బ్రహ్మ పురాణం, సనాతన ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు పిటీషన్‌లో అభ్యంతరాలు తెలిపారు.

# ప్రభాస్ ఫౌజీ డిసెంబర్ 3న

### రిలీజ్ డేట్‌తో పాటు పోస్టర్ విడుదల





ప్రభాస్ హీరోగా వస్తోన్న ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది. 'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతంలో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నన్ను ధైర్యంగా నిలబెట్టింది నా భార్యనే : అఖిల్

మూడేళ్లుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని.. తన భార్య జైనబ్ వెన్నంటే ఉండి ధైర్యాన్ని ఇచ్చిందన్నారు నటుడు అఖిల్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'లెనిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి కృతజ్ఞతలు చెప్పిన అఖిల్ తన కుటుంబం గురించి మాట్లాడారు. నేను జైనబ్‌ను ఇంట్లో బంగారు తల్లి అని పిలుస్తాను. మూడేళ్లుగా నేను బాధలో ఉన్నప్పుడు నా పక్కనే ఉంటూ నన్ను ఎంతో సపోర్ట్ చేసింది. నాకు గైడ్‌లా ఉంటూ ధైర్యాన్నిచ్చింది. ఇక, లెనిన్ విడుదలైన అనంతరం జరిగిన ఈవెంట్‌లో నేను నాన్నను హగ్ చేసుకున్నాను. అందులోనే నేను పదేళ్లుగా దాచుకున్న ఎమోషన్స్ అన్నీ బయటకు వచ్చాయి. ఇన్నేళ్లలో నాన్న నన్ను ఒక్కసారి కూడా తిట్టలేదు. నిరుత్సాహపర్చలేదు. నాకు సర్వస్వం ఆయనే. ఒక స్నేహితుడిలా ఈ జర్నీలో తోడుగా ఉన్నాడు. 'లెనిన్'ను తన భుజాలపై మోశాడు. అక్కినేని అభిమానులకు మంచి సినిమాను అందించాలనే తపనతో వర్క్ చేశాడు' అని అఖిల్ చెప్పారు. ఇక అభిమానుల గురించి మాట్లాడుతూ.. 'ఎన్నో జన్మల పుణ్యం చేస్తే ఇలాంటి అభిమానులు దొరుకుతారు. ఫ్యాన్స్ కోసం అయినా హిట్ కొట్టాలని మా ఆవిడతో ఎప్పుడూ చెప్పేవాడిని. నన్ను నమ్మిన ప్రేక్షక దేవుళ్లందరికీ ఒక్కటే మాట చెబుతున్నాను. నేనేం కాలర్ ఎగరేయను.. విజయం సాధించాం అని గర్వపడను. ఇప్పటి నుంచి నా కొత్త ప్రయాణం మొదలవుతోంది. నేను చేయాలనుకుంటున్న యుద్ధాన్ని ప్రశాంతంగా చేస్తానని అన్నారు.

----------



# డబ్బుల కోసమే సినిమాల్లోకి వచ్చా..

### ఒకప్పుడు కూలీ పని కూడా చేశా: విజయ్ సేతుపతి

సినిమా పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా, కేవలం తన అద్భుత నటనతో 'మక్కల్ సెల్వన్' (ప్రజల నటుడు)గా ఎదిగిన విజయ్ సేతుపతి.. తమిళ, తెలుగు ప్రేక్షకులలో సంపాదించుకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆయన తన చిన్ననాటి కష్టాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి పంచుకున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి."చిన్నప్పుడు మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేది. మా నాన్న మా కోసమే చాలా అప్పులు చేశారు. అవి తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. కొన్నిసార్లు అప్పులవాళ్లు మా ఇంటిపైకి గొడవకు వచ్చేవారు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని" అని సేతుపతి గుర్తుచేసుకున్నారు. ఎన్ని కష్టాలున్నా ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు నాన్న బుల్లెట్ బండిపై వస్తూ ఫ్రైడ్ రైస్ తెచ్చేవారని, కుటుంబమంతా కలిసి దాన్ని పంచుకుని తినే ఆ క్షణాలు తన జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని చెప్పారు. నటుడు అవ్వాలనేది విజయ్ సేతుపతి లక్ష్యం కాదట. కేవలం కుటుంబ బాధ్యతలు, డబ్బుల కోసమే ఆయన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్కూల్ రోజుల్లో కూలీ పనికి వెళ్లారు. ఆ తర్వాత రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత దుబాయ్ వెళ్ళి అక్కడ అకౌంటెంట్‌గానూ ఉద్యోగం చేశారు. దుబాయ్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత నాటక రంగానికి చెందినవారితో ఏర్పడిన పరిచయమే విజయ్ సేతుపతి జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ.. 'తెన్మేర్కు పరువకాట్రు' చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత 'సూదు కవ్వమ్', 'విక్రమ్ వేద', 'పిజ్జా', 'మహారాజా' వంటి విలక్షణమైన చిత్రాలతో స్టార్ హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన 'ట్రైన్', 'స్లమ్ డాగ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.



# కష్టాలు లేనిది ఎవరికి?

### : నటుడు 'శుభలేఖ' సుధాకర్



'శుభలేఖ' సుధాకర్ .. విభిన్నమైన పాత్రలకు కెరాఫ్ అడ్రెస్ గా కనిపిస్తారు. ఇటు సినిమాలలోను .. అటు సీరియల్స్ లోను ఎన్నో విలక్షణమైన పాత్రలను పోషించి మెప్పించినవారాయన. తాజాగా ' సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "మొదటి నుంచి కూడా నటన అంటే చాలా ఇష్టంగా ఉండేది. అదే నన్ను సినిమాల వైపుకు నడిపించింది. 'శివ' సినిమా తరువాత చాలా గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో నేను చాలా ఇబ్బందిపడ్డాను. ఏం చేయాలో .. ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి అది" అని అన్నారు."జీవితంలో కష్టాలు లేనివారంటూ ఎవరూ ఉండరు. ఎవరికి ఉండవలసిన కష్టాలు వారికి ఉంటూనే ఉంటాయి. అలా ఎన్నో కష్టాలను ఎదుర్కొని నిలబడ్డాను. అందువలన నాకు ఆకలి బాధ తెలుసు. ఎవరైనా ఆకలి అంటే.. సాయం చేయకుండా ఉండలేను. అలా ఎంతోమందికి సాయం చేసినవాడిని నేను. అయితే కొంతమంది దానిని అవకాశంగా తీసుకుంటున్నారని గ్రహించిన తరువాత, అవసరం ఏమిటనేది తెలుసుకున్న తరువాతనే సాయం చేయడం మొదలుపెట్టాను" అని చెప్పారు. 'ఒకానొక సమయంలో సినిమాలలో పూర్తిగా అవకాశాలు తగ్గినప్పుడు టీవీ సీరియల్స్ నాకు అన్నం పెట్టాయి. అందువలన నేను వాటితోనే బిజీ అయ్యాను. ఈ మధ్య కాలంలో మళ్లీ సినిమాలలో మంచి వేషాలు పడుతున్నాయి. అందుకు చాలా సంతోషంగా ఉంది. టీవీ .. సినిమా అనే వాటిని నేను వేరుగా చూడను. నటుడిగా ముందుకు వెళుతున్నానా లేదా అనేది మాత్రమే చూస్తాను. నేను భగవంతుడిని బలంగా నమ్ముతాను. మన ప్రయత్నం మంచిదైతే .. అందులో నిజాయితీ ఉంటే ఆయన సాయం తప్పకుండా అందుతుంది" అని అన్నారు.